సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 16 । మార్చి । 2025



మట్టి.. కొల్లగొట్టి!

అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



చెరువును చెరబట్టి

శిఖం పట్టాలను అడ్డం పెట్టుకుని చెరువు ఆనవాళ్లకే ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలో కట్టను పూర్తిగా తొలగించారు. 8లో▸



న్యూస్‌రీల్

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ అభివృద్ధి సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్యబట్టు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట్‌లో హెవీమోటార్, లైట్ మోటార్ వాహనంపై డ్రైవింగ్ శిక్షణ ఇస్తామన్నారు. 38 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, పూర్తయిన తర్వాత సంబంధిత రవాణా సంస్థ అర్హత కలిగిన అభ్యర్థులకు పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. అభ్యర్థులకు హకీంపేట టీజీఆర్టీసీ కార్యాలయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. లైట్ మోటార్ శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాలు, హెవీ మోటార్ శిక్షణకు 20 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండాలని, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, మూడు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ బీసీ యువతీయువకులు బీసీ అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పూర్తి సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు.

రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లకు ప్రభుత్వం మూడు నెలలుగా సుమారు రూ.70 కోట్ల కమీషన్ చెల్లించాల్సి ఉందని తెలిపారు. డబ్బుల కోసం ఎంతో కాలంగా వారు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలే చేగుంటలో డీలర్ ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో డీలర్లకు అనేక హామీలు ఇచ్చారని వాటన్నింటినీ నెరవేర్చాలని కోరారు. రూ.5వేల వేతనం, రూ.300 కమీషన్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదని, ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని కోరారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేదాకా పోరాటం



దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలకు శనివారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతిచ్చారని.. అదేమాటపై నిలబడాలన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అనంతరం ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇ.బాబు, బి.కృష్ణ, జి.యాదయ్య, డి.అశోక్, బి.ముత్యాలు, కె.కొండలు, ఎ.సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీర్లపల్లికి సీఎం శుభాకాంక్షలు



షాద్‌నగర్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పూల మాలలు సత్కరించారు.

ఏడాదిలో 980

సఖి సెంటర్‌కు అందిన ఫిర్యాదులు

అంశం	కేసులు
గృహ హింస	668
అత్యాచారం	08
బాలికలపై లైంగిక వేధింపులు	45
బాల్య వివాహాలు	27
మిస్సింగ్/కిడ్నాప్‌లు	125
ఆన్‌లైన్ వేధింపులు	34
ఇతర కేసులు	73



గృహహింస కేసులు: 668

- కిడ్నాప్, మిస్సింగ్ కేసులు : 125
- అతివలపై ఆగని అకృత్యాలు
- చట్టాలెన్ని ఉన్నా పడని అడ్డుకట్ట
- సఖి కేంద్రాలకు ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అన్ని రంగాల్లో మగవాళ్లతో పోటీపడి దూసుకెళ్తున్న మహిళలపై హింస కొనసాగుతూనే ఉంది. పితృస్వామ్య, ఆధిపత్య భావజాలం అడుగడుగునా సంకెళ్లు వేస్తోంది. ఇంటా బయట అడుగడుగునా వేధింపులు, హింస, హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రభుత్వాలు గృహ హింస, నిర్భయ వంటి కఠిన చట్టాలను తెచ్చినప్పటికీ మహిళలపై హింస వ్యవస్థీకృతంగా కొనసాగుతూనే ఉంది. అభివృద్ధిలోనే కాదు అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ హంగులను సంతరించుకున్న జిల్లాలో 2024 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి చివరి నాటికి 980 వివిధ రకాల కేసులు నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది.

చిన్నప్పటి నుంచే ఆంక్షలు

పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారు. అయినా వివక్ష కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నప్పటి నుంచే ఆంక్షలు, దాడులు కొనసాగుతున్నాయి. పెళ్లి తర్వాత అదనపు కట్నం, అందం, ఆడ పిల్లలకు జన్మ నివ్వడం వంటి కారణాలతో నిత్యం గృహ హింసకు గురవుతున్నారు. ఏడాది కాలంలో జిల్లాలోని సఖి కేంద్రాలకు వచ్చిన కేసులను పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతోంది. అంతేకాదు ఈ గృహ కేసులు బాలబాలికల నిష్పత్తిపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లాలో 1000 మంది బాలురకు 963 మంది బాలికలు ఉండటం గమనార్హం.

చిన్నచిన్న అంశాలకే మనస్పర్థలు



దంపతుల మధ్య స్వార్థం పెరిగింది. ఈగో.. చిన్నచిన్న అంశాలకే గొడవపడుతున్నారు. కుటుంబ జీవితంపై కనీస అవగాహన ఉండడం లేదు. పెళ్లి తర్వాత భర్త తరపు తల్లిదండ్రులు, ఇతర బంధువులను భార్య దూరం చేస్తోంది. భార్య తరపు బంధువులను భర్త దూరం పెడుతున్నారు. అమ్మాయి సున్నితంగా ఉంటే అబ్బాయి తరపు బంధువులు డామినేట్ చేస్తున్నారు. అబ్బాయి మెతకగా కన్పిస్తే అమ్మాయి తరపు బంధువులు వేధిస్తున్నారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు చెప్పినా వినడం లేదు. సఖి కేంద్రానికి వస్తున్న కేసుల్లో మెజార్టీ ఈ తరహాకు చెందినవే. నిజానికి వీరికి పెళ్లికి ముందే కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంది.

– వి.జ్యోత్స్న, సీడీపీఓ, సఖికేంద్రం, వనస్థలిపురం

ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్



మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమల్లోకి తెచ్చింది. అయినా హింస ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గృహ హింసకు గురయ్యేవారి కోసం 181 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు స్వయంగా ఫోన్ చేసి రక్షణ పొందొచ్చు. బాధితులకు రక్షణ కల్పించి, కౌన్సెలింగ్ ద్వారా కాపురాలను నిలబెట్టేందుకు సఖి కేంద్రాలను ఏర్పాటు చేసింది. వనస్థలిపురం, శంషాబాద్‌లో ఈ కేంద్రాలు ఉన్నాయి. వనస్థలిపురం సఖి కేంద్రంలో ఇప్పటి వరకు 881 కేసులు రాగా, 186 మినహా మిగిలిన అన్నీ పరిష్కరించాం. శంషాబాద్ కేంద్రానికి 91 కేసులు రాగా, 64 మినహా మిగిలిన కేసులు పరిష్కరించాం.

– సంధ్యారాణి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో గల భాస్కర విద్యా సంస్థల్లో 25వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నరేంద్రకుమార్‌తో పాటు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపేష్, ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కమాండ్ ఇంటెలిజెన్స్ అధికారి మేజర్ కునాల్‌సింగ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం, సరిపడా నిద్ర, వ్యాయామం ఎంతో అవసరం అని అన్నారు. పట్టుదల, కృషి ఉంటే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. రూపేష్, మేజర్ కునాల్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కృష్ణారావు, బీఎంసీ డైరెక్టర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న నరేంద్రకుమార్

అంతరాయం రానివ్వం

- సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం
- రెప్పపాటు కూడా కరెంట్ పోనివ్వం
- కోతలకు ఆస్కారం లేకుండా డిమాండ్ మేరకు సరఫరా
- ఇప్పటికే లైన్ల పునరుద్ధరణ పూర్తి
- కొత్తగా మరో ఐదు సబ్‌స్టేషన్లు
- 'సాక్షి'తో సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ చెన్నుగారి మాధవరెడ్డి



హుడాకాంప్లెక్స్: 'గత ఏడాది మే3న రికార్డు స్థాయిలో 8.49 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈ ఏడాది ఇప్పటికే మార్చి 14న 6.63 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. ఏప్రిల్ మొదటి వారం నాటికి ఏకంగా 10 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అంచనా వేశాం. ఆ మేరకు ముందస్తుగా లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టాం. అధిక లోడు కారణంగా తరచూ విద్యుత్ అంతరాయాలకు కారణమవుతున్న సబ్ స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు గుర్తించి, వాటి సామర్థ్యం పెంపు పనులు పూర్తి చేశాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం' అని ఎస్పీడీసీఎల్ సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ చెన్నుగారి మాధవరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ వివరించారు.

ఏటా 20 శాతం డిమాండ్ పెరుగుదల

సరూర్‌నగర్ సర్కిల్‌లో మొత్తం 7,50,340 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో గృహ కనెక్షన్లు 6,15,176, వాణిజ్య కనెక్షన్లు 96,680, పారిశ్రామిక కనెక్షన్లు 3,867, వ్యవసాయ కనెక్షన్లు 24,856 ఉన్నాయి. ఇక్కడ రోజు సగటు గరిష్ట విద్యుత్ డిమాండ్ 6 మిలియన్ యూనిట్లుగా ఉంది. సరూర్‌నగర్, చంపాపేట్, ఇబ్రహీంపట్నం డివిజన్ల పరిధిలో కొత్త నిర్మాణాలు, విద్యుత్ కనెక్షన్లు భారీగా వచ్చి చేరుతుండటంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ప్రతి ఇంట్లో ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, టీవీ, ఫ్యాన్లు, లైట్లు సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా విద్యుత్ డిమాండ్ ఏటా 15 నుంచి 20 శాతం పెరుగుతోంది.

పీటీఆర్, డీటీఆర్‌ల సామర్థ్యం పెంపు

పారిశ్రామిక, వాణిజ్య వినియోగంతో పోలిస్తే గృహ వినియోగం ఏటా పెరుగుతోంది. చంపాపేట్ డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్, మీర్‌పేట సహా సరూర్‌నగర్ డివిజన్‌లోని వనస్థలిపురం, బీఆర్ఎస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని తుర్కయంజాల్, ఇంజాపూర్‌లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్నట్లు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలోని 23 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై సామర్థ్యానికి మించి లోడు నమోదవుతున్నట్లు గుర్తించి, ఈ మేరకు ఇప్పటికే 4 పీటీఆర్లను 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏ సామర్థ్యానికి పెంచాం. 309 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, ఇప్పటికే 180 డీటీఆర్‌ల సామర్థ్యాన్ని 100 నుంచి 160 కేవీఏకు పెంచాం. 49 (11కేవీ) ఫీడర్లు, మరో ఏడు 33 కేవీ ఫీడర్ల బైఫర్‌కేషన్/అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశాం.

రూ.120 కోట్ల అంచనాతో కొత్త సబ్‌స్టేషన్లు

శివారు ప్రాంతాల్లో కొత్తగా అనేక కాలనీలు పుట్టుకొస్తున్నాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. భవిష్యత్తు అవసరాల మేరకు కొత్తగా మరో ఐదు 33/11 కేవీసబ్‌స్టేషన్లు (బడంగ్‌పేట్ డంపింగ్‌యార్డ్, కుంట్లూరు మదర్‌డెయిరీ, మన్సూరాబాద్ పెద్ద చెరువు, కోహెడ పండ్ల మార్కెట్, కొంగర కలెక్టరేట్ సముదాయం) ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రూ.120 కోట్ల అంచనాతో నాలుగు చోట్ల ఇండోర్, ఒక చోట అవుట్ డోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం.

బిల్లింగ్, రెవెన్యూ వసూళ్ల కోసం..

నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా పని చేస్తున్నాం. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, కోతలు, ఇతర ఫిర్యాదుల స్వీకరణకు 1912 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. విద్యుత్ కనెక్షన్ల జారీ, కొత్త లైన్ల ఏర్పాటు, లైన్ షిఫ్టింగ్‌వర్క్స్‌ల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై నిరంతర నిఘా పెడుతున్నాం. ప్రతినెలా నిర్దేశిత సమయంలోగా బిల్లులు జారీ చేయడంతో పాటు పాత బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. గృహజ్యోతి పథకం కింద 1,18,983 మంది వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నాం.



అందంగా రూపుదిద్దుకున్న బేగంపేట రైల్వేస్టేషన్ ముఖ ద్వారం

బేగంపేటకు ఆధునిక హంగులు

- సరికొత్త రూపాన్ని సంతరించుకున్న రైల్వే స్టేషన్
- తొలి దశలో రూ.26 కోట్లతో అభివృద్ధి
- 95 శాతం పనులు పూర్తి
- త్వరలో రెండో ఫేజ్‌కు శ్రీకారం
- అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా..

సనత్‌నగర్: బేగంపేట రైల్వేస్టేషన్ సరికొత్త రూపును సంతరించుకుంది. ఆధునిక హంగులతో.. అంతర్జాతీయ ప్రమాణాలను అద్దుకుంది. 'అమృత్ స్టేషన్' పథకం కింద మొత్తం రూ.38 కోట్లతో బేగంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను గత ఏడాది ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.26 కోట్ల వ్యయంతో ప్రారంభమైన మొదటి ఫేజ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పుడు బ్రాహ్మణవాడీ వైపు నుంచి చూస్తే ఇది బేగంపేట రైల్వేస్టేషనేనా? అనే రీతిలో కనువిందు చేసేలా ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలోకి అడుగుపెట్టే ముందే రాష్ట్ర పక్షి పాలపిట్టల బొమ్మలు ప్రయాణికులను, సందర్శకులను ఆకట్టుకున్నాయి. రైల్వేసేషన్ లోపలికి వెళ్లకముందే బయట ప్రకృతి అందాలతో మైమరిపించే రీతిలో తీర్చిదిద్దుతున్నారు. ప్రాంగణంలో ఉన్న రాక్‌ను అందమైన ఫౌంటెన్‌గా మలిచి పచ్చటి లాన్‌లతో ప్రకృతి ప్రేమికులను ముగ్ధులను చేసే రీతిలో అభివృద్ధి చేస్తున్నారు.

ప్రయాణికులకు సకల వసతులు

ఎస్కలేటర్లు, ర్యాంప్‌లు, లిఫ్టులు, చూడముచ్చటగా తీర్చిదిద్దిన వెయింటింగ్ హాల్, రైళ్ల సమాచారాన్ని ప్రయాణికులు ప్రత్యక్షంగా చూసుకునేలా వివరాల డిస్‌ప్లే, రద్దీకి అనుగుణంగా టికెట్ కౌంటర్ల నిర్మాణం, స్టేషన్‌లో ఏ సేవలు ఎక్కడున్న విషయాలను సులభంగా తెలుసుకునేలా ఎల్ఈడీ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రాంగణాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆయా పనులన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఏర్పాటు చేశారు. మొదటి ఫేజ్ కింద రైల్వేస్టేషన్‌కు ఒకవైపు చేపట్టిన అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయి. త్వరలో మరో 5 శాతం పనులు కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ తర్వాత రెండో ఫేజ్‌లో మరోవైపు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

ఓయూలో ఆందోళనలపై నిషేధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళనలు, ధర్నాలు, నిరసన ర్యాలీలు, నినాదాలు తదితర కార్యక్రమాలపై నిషేధం విధిస్తూ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యా వాతావరణం నెలకొల్పేందుకు, ఆందోళనల పేరుతో బోధన, పరిశోధనలకు విఘాతం తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విధులకు ఆటంకం కలిగించడం, సిబ్బందిని దుర్భాషలాడటంతో పాటు ఓయూ క్యాంపస్‌లోని కాలేజీలు, వివిధ విభాగాలు, సెంటర్లు, పాలన భవనం తదితర ప్రదేశాల్లో ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టినా చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి పేర్కొన్నారు.

మేధావులు నోరు విప్పాలి

ఓయూలో ఆందోళనలపై విధించిన నిషేధాజ్ఞలపై మేధావులు, విద్యావేత్తలు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యుడు ప్రొ.విశ్వేశ్వర్ రావు, సామాజిక వేత్త ప్రొ.హరగోపాల్, టీజేఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ నోరు విప్పాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు చటారి దశరథ్, జంగయ్య డిమాండ్ చేశారు. ఓయూ అధికారుల తీరు అప్రజాస్వామికమన్నారు. నాటి వందేమాతరం ఉద్యమం మొదలు ప్రత్యేక తెలంగాణ, ఎస్సీ వర్గీకరణ తదితర అనేక ఉద్యమాలతో పాటు చివరకు వీసీలను నియమించాలని విద్యార్థులు పోరాడి విజయం సాధించారని ఏబీవీపీ నాయకులు అలివేలి రాజు పేర్కొన్నారు.

- లే అవుట్‌లు, నిర్మాణ రంగంపై సందిగ్ధం
- విస్తరణ జీఓ వెల్లడితో అంతా గందరగోళం
- సమగ్ర మాస్టర్‌ప్లాన్ లేకుండా అనుమతులు కష్టమే

పర్మిషన్.. పరేషాన్!

హెచ్ఎండీఏ విస్తరణతో డీటీసీపీకి బ్రేక్



సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించకుండానే ఆగమేఘాల మీద హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)ను ట్రిపుల్ ఆర్ వరకు విస్తరిస్తూ తెచ్చిన జీఓ.. రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసేలా మారింది. నిర్మాణ రంగం కూడా మరింత బలహీన పడే పరిస్థితి నెలకొంది. ఇంచుమించు ఏడాదిన్నరగా చతికిల పడ్డ 'రియల్ భూమ్'ను ఇది మరింత భూస్థాపితం చేసేలా మారిందని నిర్మాణరంగ నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల నుంచే ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం లభించింది. నగరం చుట్టుపక్కల ఉన్న భూములు బంగారం కంటే ప్రియంగా మారాయి. అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. హెచ్ఎండీఏ భూములకు సైతం భారీ డిమాండ్ వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ హెచ్ఎండీఏ భూములను అమ్మకానికి పెట్టినా రూ.వందల కోట్ల ఆదాయం లభించింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలతో రియల్ రంగం వెనుకంజ వేసింది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ విస్తరణతో తిరిగి కొంత రియల్ భూమ్ రావచ్చని మొదట్లో భావించారు. కానీ.. ఏ విధమైన ప్రణాళికలు, విధి విధానాలు లేకుండానే ఆకస్మికంగా జీఓ తేవడంతో అనుమతులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇప్పటి వరకు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి లభించే అనుమతులకు తాజాగా బ్రేక్ పడింది. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

పరిస్థితి అగమ్యగోచరం

హైదరాబాద్ విస్తరణ పట్ల ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ.. అసలు మాస్టర్‌ప్లాన్ లేకుండానే విస్తరణ జీఓ ఇవ్వడం వల్ల స్పష్టత లేకుండా పోయింది. రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రంగానికే కాదు హైదరాబాద్ అభివృద్ధికి కూడా ఇది నష్టమే.

– సత్యనారాయణ చిట్టి, రియల్ ఎస్టేట్ నిపుణుడు



అనుమతులు ఇచ్చేదెవరు?

ఇప్పటికే డీటీసీపీ పరిధిలో భూములు కొనుగోలు చేసి లేఅవుట్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లకు ఎలాంటి సమాధానం లభించడం లేదు. ప్రస్తుతం లే అవుట్ అనుమతుల అంశం తమ పరిధిలో లేదంటూ డీటీసీపీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణదారులు రెండు, మూడు రోజులుగా హెచ్ఎండీఏకు తరలి వస్తున్నారు. కానీ.. హెచ్ఎండీఏలో సైతం చుక్కెదురే కావడం గమనార్హం. ట్రిపుల్ ఆర్ వరకు తమ పరిధి పెరిగినప్పటికీ ఇంకా ఎలాంటి విధివిధానాలు రాలేదని చెబుతున్నారు. మరోవైపు కొత్త మాస్టర్ ప్లాన్ వస్తే తాము అనుమతులు ఇవ్వలేమంటున్నారు. దీంతో రియల్టర్లు, వ్యాపార వర్గాలు, ఆర్కిటెక్టర్లు తదితర వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. 'అనుమతుల కోసం కొంత కాలం ఆగాల్సిందేనంటున్నారు. కానీ.. ఎంతకాలం అనే దానిపై స్పష్టత లేకుండాపోయింది. పైగా మాస్టర్ ప్లాన్ లేకుండా అనుమతులను ఇవ్వడం కూడా సాధ్యం కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇది నష్టదాయకంగా మారింది' అని కందుకూరు ప్రాంతానికి చెందిన రియల్టర్ ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంకుల నుంచి, ఇతరత్రా రుణాలు తీసుకుని భూములు కొనుగోలు చేసిన వ్యాపారుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

మాస్టర్‌ప్లాన్‌కు మరో ఏడాది

మొత్తం తెలంగాణ ప్రాంతాన్ని మూడు భాగాలుగా చేసి సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మిగతా తెలంగాణ అంతా రూరల్‌గా పరిగణిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు వరకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్- 2050ని రూపొందించాల్సి ఉంది. కానీ.. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం ఆసక్తి గల అంతర్జాతీయ సంస్థల నుంచి రిక్వెస్ట్ ప్రపోజల్స్‌ను ఆహ్వానించేందుకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు చెప్పారు. ఎంపిక చేసిన సంస్థ పూర్తిగా అధ్యయనం చేసి సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు కనీసం ఏడాది సమయం పట్టవచ్చని అంచనా. మాస్టర్ ప్లాన్ సిద్ధమైతే తప్ప హెచ్ఎండీఏ నుంచి అనుమతులు లభించవు. అంటే అప్పటి వరకు ట్రిపుల్ ఆర్ వరకు అన్ని రకాల నిర్మాణాలు, లే అవుట్‌లు, వెంచర్‌లు నిలిచిపోవాల్సిందేనా అనే సందేహం నెలకొంది. ఈ పరిణామం రియల్ ఎస్టేట్ భవిష్యత్‌ను మరోసారి ప్రశ్నార్థకంగా మార్చిందని ఆ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పట్టాలు అడ్డుపెట్టి చెరువును చెరబట్టి



తొలగించిన జంబులకుంట చెరువు కట్ట

జంబులకుంట చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పనులు

- శిఖం పట్టాలను అడ్డం పెట్టుకుని కట్టను ధ్వంసం చేస్తున్న వైనం
- చెరువు ఆనవాళ్లను మాయం చేసేలా కుట్ర
- ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

మొయినాబాద్: చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షించాలని ఓ వైపు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తుంటే కొందరు మాత్రం చెరువులనే మాయం చేసేస్తున్నారు. చెరువు కట్టను పూర్తిగా తొలగించి, ఆనవాళ్లు లేకుండా చేసే పనిలో ఉన్నారు. మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ రెవెన్యూలో ఈ తతంగం సాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. బాకారం జాగీర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 11, 12లో జంబులకుంట చెరువు ఉంది. 21 ఎకరాల్లో విస్తరించిన ఉన్న చెరువు భూమిలో శిఖం పట్టాలున్నాయి. చెరువులోని నీళ్లు ఇంకిపోయినప్పుడు మాత్రమే సంబంధిత వ్యక్తులు ఇందులో పంటలు సాగు చేసుకోవాలి. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. ఇతర అవసరాలకు సైతం వాడుకోవద్దు. కానీ కొంతమంది ఈ నిబంధనలను పట్టించుకోకపోవడంతో పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శిఖం పట్టాలను అడ్డం పెట్టుకుని కొందరు చెరువు ఆనవాళ్లకే ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలో కట్టను పూర్తిగా తొలగించారు. ఈ విషయం గుర్తించిన స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువును కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేస్తున్నారు

హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18 వరకు గడువు

సాక్షి, సిటీబ్యూరో : హజ్ వీసా జారీకి ఏప్రిల్ 18వ తేదీని తుది గడువుగా సౌదీ అరేబియా హజ్, ఉమ్రా మంత్రిత్వశాఖ నిర్ణయించినట్లు హజ్ ఉమ్రా గ్రూప్ ఆర్గనైజర్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు అల–హాజ్ మహమ్మద్ అబ్దుల్‌రజాక్ క్వమర్ తెలిపారు. నాంపల్లిలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులు గడువులోగా తమ బుకింగ్‌లను తెలంగాణ, ఏపీ ప్రైవేట్ హజ్ గ్రూప్ ఆపరేటర్ల ద్వారా పూర్తి చేసుకోవాలన్నారు. సాధారణంగా హజ్ వీసాలు ఒక వారం ముందు వరకూ జారీ చేస్తారని..అయితే మారిన కొత్త నిబంధనల ప్రకారం నెల ముందే వీసా జారీ చేస్తారని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ఖాన్, ఫహీమ్ దియానీ, మహమ్మద్ అజీంఉద్దీన్ పాల్గొన్నారు.

బైక్ దొంగకు రిమాండ్



హాజీ

ఆమనగల్లు: బైక్‌ను చోరీ చేసిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన సబావత్‌వాల్యా గత ఏడాది డిసెంబర్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన హాజీ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాజీని కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆరోపణ

శంషాబాద్ రూరల్: ఛాతి నొప్పితో ఆస్పత్రికి వెళ్లిన ఓ గర్భిణి మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ నివాసి బుషమోని ప్రమీల(33) 9 నెలల గర్భిణి. మొదటి నుంచి ముచ్చింతల్ శివారులోని జిమ్స్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతుంది. నెలలు నిండడంతో ప్రమీలను ఈ నెల 11న జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. 13వ తేదీ వరకు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆమెను వైద్యులు ఇంటికి పంపించారు. 18న ఆస్పత్రికి రావాలంటూ డాక్టర్ పూజిత కొన్ని మందులు రాసిచ్చారు. శుక్రవారం రాత్రి ప్రమీల భోజనం తర్వాత వైద్యులు ఇచ్చిన మందులు వేసుకుంది. కాసేటి తర్వాత ఛాతిలో నొప్పి రావడంతో భర్త సాయిబాబు ఆమెను రాత్రి 10.30 గంటలకు జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో నర్సులు ఆమెను పరిశీలించారు. 12.15 గంటలకు డాక్టర్ రామారావు ఆమెను పరీక్షించగా అప్పటికే చనిపోయింది. సకాలంలో వైద్యం అందక తన భార్య మృతి చెందిందని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్టి.. కొల్లగొట్టి!



పెద్దమంగళారంలో డంప్ చేసిన నల్లమట్టి



పెద్దమంగళారం పెద్ద చెరువులో మట్టి తరలింపుతో ఏర్పడిన గుంతలు

యథేచ్ఛగా అక్రమ దందా

- చెరువులు, కుంటల నుంచి తరలిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ భూములే లక్ష్యంగా తవ్వకాలు
- రాత్రి వేళ, సెలవుదినాల్లో టిప్పర్ల ద్వారా తరలింపు
- ఫాంహౌస్‌లలో పోసి సొమ్ము చేసుకుంటున్న వైనం

మొయినాబాద్: అక్రమార్కులకు మట్టే బంగారమవుతోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో నుంచి తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో మట్టిని తీసుకెళ్లి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఫాంహౌస్‌లకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం వందలాది టిప్పర్ల మట్టి తరలిపోతోంది. నగరానికి కూత వేటు దూరంలో ఉన్న మొయినాబాద్‌లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. టిప్పర్ల యజమానులు నిత్యం ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో మట్టి తవ్వి విక్రయిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం పెద్ద చెరువులో నుంచి కొద్ది రోజులుగా నల్లమట్టిని తరలించుకుపోతున్నారు. రాత్రి వేళటిప్పర్ల ద్వారా తీసుకెళ్లి ఒకచోట డంప్ చేసుకుంటున్నారు. ఆతర్వాత ఫాంహౌస్‌లకు అమ్ముతున్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడ సమీపంలో ఉన్న హిమాయత్‌సాగర్ చెరువులో నుంచి సైతం నల్లమట్టిని తరలిస్తున్నారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల నుంచి ఎర్రమట్టి, మొరం తవ్వుతున్నారు. పెద్దమంగళారం, అప్పోజీగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో ఎర్రమట్టి, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కపల్లి, తోలుకట్ట ప్రాంతాల నుంచి మొరం తరలిస్తున్నారు. ఇలా నిత్యం వేలాది రూపాయల దందా నిర్వహిస్తున్నారు.

సెలవు రోజుల్లోనే అధికంగా..

సెలవు రోజులను ఎంచుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారులు ఎవ్వరూ అందుబాటులో ఉండరనే వ్యూహంతో హోలీ డేస్‌ను ఇలా వినియోగించుకుంటున్నారు. చెరువులు, కుంటలను కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదులు వచ్చినప్పుడే స్పందిస్తున్నారు. ఆతర్వాత నిఘా పెట్టడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలు అధికారులకు తెలియడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ఇవి వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేశాం

పెద్దమంగళారం పెద్ద చెరువులో నల్ల మట్టి తవ్వుతున్నట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయి. మట్టి తీస్తున్నవారిపై అప్పట్లోనే కేసులు నమోదు చేశాం. మళ్లీ ఎవరైనా మట్టి తీస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని చెరువులపై ప్రత్యేక నిఘా పెడతాం.

– ప్రియాంక, ఇరిగేషన్ ఏఈ, మొయినాబాద్

మద్యం మత్తులో యాసిడ్ తాగి..

శంషాబాద్ రూరల్: మద్యం తాగిన మత్తులో ఓ వృద్ధుడు యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. నర్ఖూడ వాసి ఆనంద్ చారి(62) ఈ నెల 14న హోలీ ఆడి సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి తాగిన మత్తులో బాత్రూంలోకి వెళ్లి అక్కడ ఉన్న యాసిడ్ తాగి బయటకు వచ్చాడు. గమనించిన భార్య లక్ష్మి.. వెంటనే అతన్ని శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి..అక్కడి నుంచి ఉస్మానియా తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పాండురంగ.. సేవలు వరంగా



కుష్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ చెబుతున్న రిటైర్డ్ హెచ్‌ఎం పాండురంగయ్య

- పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తున్న గురువు
- ఉద్యోగ విరమణ పొందినా నిత్యం విధులకు హాజరు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బులతో వసతుల కల్పన
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం పాండురంగయ్య

కుల్కచర్ల: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సరదాగా గడపడంతో పాటు ఇతర వ్యాపకాల వైపు దృష్టిసారిస్తారు. వారికి ఇష్టమైన వ్యాపారం, వ్యవసాయం, మొక్కల పెంపకం.. ఇలా తమ అభిరుచులకు తగిన పనులకు ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి, రిటైరైన ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య విద్యార్థుల శ్రేయస్సు కోసం పాఠాలు కొనసాగిస్తున్నారు. ఈయన సేవలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వరంగా మారాయి.

ప్రతిరోజూ బడికి..

హెచ్‌ఎం పాండురంగయ్య గత నెల 24న ఉద్యోగ విరమణ పొందారు. కానీ ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో మంచి ఫలితాలు రావాలనే లక్ష్యంతో నిత్యం బడికి వస్తున్నారు. ఎప్పటిలాగే సమయానికి స్కూల్‌కు చేరుకుని పిల్లలకు గణితం బోధిస్తున్నారు. అంతేకాకుండా దోమ, షాద్‌నగర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మ్యాథ్స్‌పై ప్రత్యేక తరగతులు చెప్పడంతో పాటు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరిస్తూ మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శమే

షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన పాండురంగయ్య 13జూన్ 2024లో ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా విధుల్లో చేరారు. అనతికాలంలోనే విద్యార్థుల నడవడికలో మార్పులు తీసుకురావడంతో పాటు వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మౌలిక వసతుల కల్పన కోసం తన సొంత డబ్బులు వెచ్చించారు. తాను పనిచేస్తున్న పాఠశాలలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమవంతు సాయం అందించేందుకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాసవి క్లబ్‌కు ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ఇప్పాయిపల్లి స్కూల్ విద్యార్థులకు వైట్ అండ్ వైట్ దుస్తులు, టై, బెల్టు, షూస్ అందజేయడంతో పాటు వాటర్ ప్యూరిఫయర్ వంటి సౌకర్యాలను కల్పించారు.



షాద్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గణితం బోధిస్తున్న పాండురంగయ్య

ఉన్నతిలోకి రావాలి



గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు నావంతు కృషి చేస్తున్నా. ఉద్యోగ విరమణ అనేది నా ఉద్యోగ జీవితంలో ఒక భాగమే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అవసర నిమిత్తం నా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా. పేద పిల్లలు ఉన్నతిలోకి రావాలనేదే నా సంకల్పం.

– పాండురంగయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం

గ్రామసభలు తూతూ మంత్రం!

కనిపించని ప్రజల భాగస్వామ్యం

- అవగాహన కల్పించని అధికారులు

దౌల్తాబాద్: పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేకపోవడంతో ఇవి తూతూమంత్రంగా కొనసాగుతున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభలు ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు ఇందులో పాల్గొని సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలపై చర్చిస్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదును గ్రామ సభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారు.

నిర్వహణ ఇలా..

పంచాయతీల్లో ప్రతీ రెండు నెలలకు ఒకసారి సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలి. అయితే ఏడాదిం కాలంగా సర్పంచ్‌లు లేకపోవడంతో కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. సంబంధిత జీపీతో పాటు అనుబంధ గ్రామాల్లో సభలు నిర్వహించే తేదీలను ముందుగానే ప్రకటించాలి. ఈ విషయమై సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 17శాఖల అధికారులు జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు గ్రామ సభకు హాజరయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఇవేవీ పట్టించుకోవడం లేదు. కనీసం 50 మందితో గ్రామసభ నిర్వహించాలనే నిబంధనలు ఉన్నా పది మందితో కానిచ్చేస్తున్నారు. పంచాయతీ ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆసక్తి చూపని గ్రామస్తులు..

జిల్లాలోని చాలా చోట్ల నిర్వహించే గ్రామసభలకు కనీసం పది నుంచి ఇరవై మంది కూడా రావడంలేదు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఏఏలు, వైద్యసిబ్బంది మాత్రమే సభలకు హాజరవుతున్నారు. ప్రజలు, నాయకులకు సరైన సమాచారం ఉండటం లేదు. గ్రామ సభల్లో చర్చకు వచ్చే సమస్యలకు పరిష్కారం చూపితే వీటిపై గౌరవం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ గ్రామాల్లో సమస్యలు పేరుకుపోవడం, సుదీర్ఘకాలంగా పరిష్కారం కాకపోవడం వంటి కారణాలతో సభలకు ఆదరణ తగ్గుతోంది.



దౌల్తాబాద్‌లో గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష(ఫైల్)

ప్రజల భాగస్వామ్యం పెరగాలి

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులతో గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకుని స్వచ్ఛందంగా సభకు రావాలి. దీంతో సమస్యలు పరిష్కరించే వీలు కలుగుతుంది.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్